# బొమ్మలపెళ్లి




సాయంత్రం ఆరు అవుతోంది.

వరండాలో ఈజీ చైర్లో కూర్చుని పేపరు చదువుతున్నా. ఒక చివర మా మనుమరాలు అమూల్య, ఇరుగు పొరుగు పిల్లలూ కలిసి ఆడుకుంటున్నారు. అందరిలోకీ మా మనుమ రాలి గొంతుకే గట్టిగా వినబడుతోంది. స్థాన బలం కదా మరి! అందుకేనేమో డామినేట్ చేస్తోందనుకుంటా.

ఏమర్రా! మగపెళ్ళివారు వచ్చే టైమయిం ది. వాళ్ళని మర్యాద చేయాలి. కోపం రాకుండా చూడాలి... మిగిలిన వాళ్ళు తలవూపారు.

ఇంతలో వరండా ఈ చివరనుంచి ఒక మగ, ఇద్దరు ఆడ పిల్లలు ఒక పిల్లవాడి బొమ్మని పట్టుకొని హుందాగా వచ్చారు.

ఆ! అదిగో మగపెళ్ళివారు వచ్చేసారు రండి... రండి.

# కాలనాధభట్ట వీరభద్రశాస్త్రి

అమూల్య నా దగ్గరకు వచ్చి, తాతగారూ! మీరు కుర్చీని ఆ చివరకి జరుపుకోండి. ఇక్కడ మగపెళ్ళి వారు కూర్చోవాలి అంది.

నాకు ముచ్చటేసి అలాగే అమూల్యా అని బుగ్గ మీద ముద్దు పెట్టుకొని, కుర్చీని వరండా చివరకు జరిపి కూర్చున్నా.

ఇక మొదలయింది సందడి. ఒకటే హడావిడి.

ఒరే నానిగా... నువ్వు పురోహితుడివి. పెళ్ళి చేయించాలి. తెలుసా ఎలా చేయించాలో?

ఓ! అలాగే. మరి... జీలకర్ర, బెల్లం ముక్కా ఉందా?

అదిగో పళ్ళెంలో ఉంది అది తినకూడదు రోయ్.

ఏమర్రా! తలంబ్రాలు బియ్యం ఉన్నాయా?

ఎవరి మట్టుకు వాళ్ళు తెగ హడావిడి పడిపోతున్నారు.

పేపరు పక్కన పెట్టి కుతూహలంగా చూస్తున్నా.

కొబ్బరిబూరాలతో సన్నాయి మోగింది.

హుషారుగా పెళ్ళి చేసేసారు.

మధ్య మధ్య అలకలు, కసురుకోడాలు... అబ్బే ఉత్తుత్తి కసురుకోడమేలే ఆటలో అరటి పండు అని ఒకళ్ళూ, కట్నం ఇస్తామని ఎగ్గొట్టారేమిటీ అని ఒక అబ్బాయి...

ఆ ఇదిగో కట్నం లక్షరూపాయలూ అని వాడిచేతిలో ఓ కాగితం పెట్టింది అమూల్య.

మరి పిల్లకు నగలో? అని అడిగింది పేద్ద ఆరిందాలా.

నగలా? కంసాలికిచ్చా చేయమని ఇవ్వగానే ఇస్తాం అని సమాధానం.

బాగుంది సంబడం... అని మూతి వంకర్లు తిప్పారు అమూల్యా వాళ్ళు.

మొత్తానికి పెళ్ళి అయింది – అప్పగింతలు అయ్యాయి.

మా అమూల్య ముక్కు చీదుకుంటూ దొంగ ఏడుపు ఏడుస్తూ అప్పగింతలు కార్యక్రమం పూర్తి చేసింది.

ఇక రండర్రా! విందు భోజనం చేద్దాం అని పిల్లల్ని వరసగా కూర్చోబెట్టి మరమరాలు, శనగపప్పు, బెల్లం ముక్కలు కాగితం ప్లేట్లలో పెట్టి అందరికీ పంచి పెట్టింది.

ఓ కాగితం ప్లేటు నా దగ్గరకు తెచ్చి తాతగారూ ఇదిగో మా అమ్మాయి పెళ్ళి విందు అని ఇచ్చింది.

ఇంతలో మా ఆవిడ వచ్చింది చేత్తో పెద్ద లడ్డు పుచ్చుకొని. ఏమే అమూల్యా నాకు పెట్టవేమిటే విందుభోజనం? అని అడిగింది.

అయ్యో మాయమ్మ! పెద్ద ముత్తయిదువు... నీకు పెట్టకుండానా? అని ఒక ప్లేటు వాళ్ళ మామ్మకి ఇచ్చింది.

అది సరే... ఇదిగో పక్కింటి నీలకంఠం తాతగారు తిరుపతి కళ్యాణం లడ్డు ఇచ్చారు పిల్లలకు పెట్టు అని ఇచ్చింది.

ఇదిగోనర్రా! తిరుపతిలో ఇంకో పెళ్ళి అయిందట అని తలోముక్కా చిదిమి పెట్టింది.

నా మనోనేత్రంలో తిరుపతి కళ్యాణం, ఇక్కడ పిల్లల బొమ్మల పెళ్ళి ఒకదాని పక్క మరొకటి సమానాంతర రేఖలో కనపడ్డాయి.

ఏడు కొండలవాడా... వెంకటరమణా... గోవిందా! గోవిందా!! ●